# ఆజ్ఞాధిక్కారం

# 9

దట్టమయిన కీకారణ్యంలో కార్చిచ్చు ప్రజ్వలించినట్టు, పరిహాసపురం రాజవీథిలో వసంత సంధ్యాకాంతి ఉరకలువేస్తూ పరుగులుపెట్టింది. క్రమక్రమంగా మరికొంతసేపటికి సంజ చీకటి నలువైపుల అలుముకున్నది.

అనాడా నగరంలో ఒక మహోత్సవం జరుగుతూంది. సరోవరాలతో, ఉద్యానవనాలతో, పెద్ద పెద్ద భవనాలతో పరిహాసపుర నిర్మాణం పూర్తిచేయించి, కాశ్మీరాధిపతి లలితాదిత్య చక్రవర్తి దాని మధ్యభాగంలో పరిహాసకేశవ దేవాలయం నిర్మించాడు. ఒక శుభ ముహూర్తంలో సంప్రదాయ పద్ధతిలో దానికి సంప్రోక్షణ మహోత్సవం జరిపించాడు.

ఆ మహోత్సాహంతో ఆ దేవళాని కెదురుగా ఒక విశాల సౌధం పై అంతస్తులో పైడిగద్దెపై విశ్రమించి, కన్నార్పకుండా ఆ దేవాలయం శిల్పాల సొగసు పరిశీలిస్తున్నాడు. మధ్యమధ్య మైమరిపించే మధుర ద్రాక్షమద్యం సేవిస్తున్నాడు. అతని కొంకెంత వెనక భాగంలో ప్రధానమంత్రి మిత్రశర్మ వేరొక సుఖాసనంపై కూర్చున్నాడు. పరిచారికా పరిచారకు లనుక్షణము అజ్ఞలకోసం నిరీక్షిస్తూ శిరస్సులపై దోసిళులొగ్గి నిలుచున్నారు.

అంతలోనే ఒక పరిచారిక ఒయ్యారంగా వంగి, శిరస్సొకించుక వంచుకుని బంగారు పానపాత్రికనిండా మాటిమాటికీ మందారంవంటి ద్రాక్షా మదిర పూరించింది.

ఆ మహానగరంవైపు. ఆ దేవళంవైపు చూస్తూంటే లలితా దిత్యుని కపూర్వోల్లాసం కలిగింది. తన కాశ్మీర సామ్రాజ్యంలో మరి సాటిలేని పరిహాస మహానగరము, దానిమధ్యన పరిహాస కేశవ దేవా లయము దివ్య శిల్పాలతో తీర్చిదిద్దడం నాటికి పూర్తి అయింది కదా అని అతని కెంతయినా ఆనందం కలిగింది. శరీరం గగుర్పొడిచింది.

పరిహాస కేశవస్వామి ప్రతిమ తళతళలాడే వెండితో రూపొం దించిన అపూర్వ శిల్పవైభవము! ఆ దైవతం పెదవులపై చిరునవ్వు భక్తుల కందరికి ఆప్యాయతతో అభయం ప్రసాదిస్తున్నట్టు మెరు స్తుంది. దానివైపు చూచినంతలోనే వారొక్కొక్కరు తమ దైనందిన దుర్భర దుఃఖాలన్నీ విస్మరిస్తారు! పరిహాసపురంమధ్యలో ప్రతిష్ఠించి నందువల్లనే ఆ దైవాని కా పేరేర్పడింది! అది సార్థక నామధేయమే అయింది!

దేవేంద్రుని రాజధాని అమరావతినే పరిహసించగల శిల్పవైభ వంతో విరాజిల్లుతున్నందువల్లనే లలితాదిత్య సార్వభౌము డా నగ రానికి పరిహాసపురమని విచిత్రమయిన పేరు పెట్టాడు.

తా నా విధంగా కొంగ్రొత్తగా నిర్మింపజేయించిన పరిహాస పురం రాజవీథిలో సిరిసంపదలతో, పిల్లలతో, పాపలతో కలకల లాడుతూ హాయిగా విహరిస్తున్న పౌరులవైపు చూడగానే లలితాదిత్య సార్వభౌముని హృదయం పట్టరాని గర్వావేశంతో పరవళ్ళు తొక్కింది. తిరిగి వేరొక మద్యపాత్ర అందుకుని దానిలో గల మధు వంతా ఒకే ఒక గుక్కలో తాగివేశాడు!

అతని దృష్టి తన కొకింత వెనకవైపున కూర్చున్న మిత్ర శర్మమీదికి హేలగా పారాడింది. అత డది గ్రహించుకుని శీఘ్రమే నెన్నుదుటిపై దోసిలికట్టి నిలుచున్నాడు. చక్రవర్తి సంతోష గర్వాతి శయాల పారవశ్యంతో కన్ను లరమోడ్చి ప్రశ్నించారు.

"అయితే మొత్తంమీద ఎలాగున్న దంటాడు మన పరిహాస మహానగరం?"

"సార్వభౌమా, వేరుగా నేను తమ దివ్యచిత్తానికి తేవలిసిం దేమి ఉన్నది? అమరాధిపతి రాజధాని ఆ అమరావతినే వెక్కిరించి

వేళాకోళం చెయ్యడమేకాదు, కాలి కొనగోటితో తలదన్నుతున్నట్లున్నది! ఇలాగ మన పట్టణాన్ని గురించి వేనోళ్ళ కొనియాడినా, బాగా తక్కువచేసి చెప్పినట్టే అవుతుంది!"

అదే తరుణంలో ఎదురుగా ఇంచుమించుగా ఒక క్రోశం దూరంలో మిణుకుమిణుకుమని మెరుస్తున్న దీపాలతో ప్రవరనగరం చక్రవర్తి కన్నెదట గోచరించింది. అది మహా ధర్మశాలి అని పేరు పొందిన ప్రాచీన కాశ్మీర చక్రవర్తి ప్రవరసేనుడు నిర్మించిన సువిశాల నగరం. శిల్పవైభవంతో దానినికూడా అధఃకరించాలన్న సంకల్పంతోనే లలితాదిత్యుడా పరిహాస పురం నిర్మించాడు. కాని ఆ వ్యవహారంలో అతని మనస్సులో తీరని మథన చెలరేగింది.

"అది సరేగాని, ప్రవరపుర పరిహాస నగరాలలో అన్నివిధాల ఏ పట్టణం గొప్పగా ఉన్నదంటారు?"

ప్రధానామాత్యునికి డెక్కపట్టినంత పని అయింది. బాగా ఆలోచనలో పడ్డాడు. సామాన్య మానవులకే కొద్దో గొప్పో అహంకారం ఉండితీరుతుంది. ఆపైన లలితాదిత్యుడు కాశ్మీర సార్వభౌముడు! తన అత్యద్భుత పరాక్రమశక్తితో కాశ్మీర పరిసర దేశాలే కాక ఇంకా ఆర్యావర్తంలో పలు ప్రాంతాలు, రాజ్యాలు జయించిన శౌర్యశాలి! ఆపైన అనేక ధర్మకార్యా లాచరించానన్న దురహంకారంతో పట్టపగ్గాలే లేకుండా ఉన్నాడు! అతని అభిప్రాయాని కెదురు చెప్పడాని కెవ్వరు సాహసించరు! ఆపైన మితిమీరిన మద్యపానంతో మరింతగా మైమరిచినట్లున్నాడు!

లలితాదిత్య చక్రవర్తి బాగా పసితనంలో రత్నకంబళంమీద పాకుతూ పారాడుతున్నప్పుడు దాసదాసీ లెవరినయినా చూచి, నోరు తెరిచి, బోసినవ్వు చిలకరించగానే అంతఃపుర ప్రధాన పరిచారిక ఆ దాసదాసీలకు విరివిగా బంగారు దీనారాలు బహూకరించేది. కాబోయే కాశ్మీర సార్వభౌముని అనుగ్రహదృష్టి, చిరునవ్వు బహుమతి ప్రదానం జరగకుండా వ్యర్థం కారాదని అంతఃపుర మర్యాద. కనకనే ఆ పరిచారిక శీఘ్రంగా బహుమానా లందించేది! అటువంటి వ్యక్తి ఆంతర్యంలో ఏమున్నదో ఎవ్వరి కెరుక? ప్రవరపురమే గొప్పగా

ఉన్నదంటే ఏమి తప్పో! లేక పరిహాసపురమే గొప్పగా ఉన్నదంటే ఏమి అపరాధమో!

ఒకవేళ ప్రవరపురమే పరిహాసనగరంకన్న అన్నివిధాల గొప్పగా ఉన్నదని ప్రశంసిస్తే, తాను నిర్మించిన పట్టణానికది గొప్ప అవమానంగా భావించి, చక్రవర్తి ఒళ్ళెరగని ఆగ్రహావేశంతో కళ్ళు మూసుకుని మీద విరుచుకుపడగలరేమో!

నిజానికి మిత్రశర్మ దృష్టిలో పురాతనకాలంలో నిర్మించిన ప్రవరనగరమే పరిహాసపురంకన్న అన్నివిధాల గొప్పగా ఉన్నదని అనిపించింది. 'అయినా ప్రభువర్యుల నానందపరచడంకోసం పరిహాసపురమే గొప్పగా ఉన్నదని చెబితేనో' అనుకున్నాడు. అంతలోనే అతనికి కొంచెం బెదురు పట్టుకుంది.

చక్రవర్తి ఒకవేళ "ఆ త్తెరి! మా వంశంలో ప్రాచీన సార్వభౌములు, అపర ధర్మమూర్తి అయిన ప్రవరసేనులు నిర్మించిన పట్టణంకన్న మేము కట్టిన నగరమే గొప్పగా ఉన్నదని ఇచ్చకాలాడతారా? ఇది మా కెంతటి తలంపు! ఇలా గనడానికి మీ కెంతటి కందకావరం తలకెక్కిందీ!" అని చంద్రనిప్పులే చెరిగి పోస్తారేమో అని ఆందోళన పడ్డాడు.

అసలే కాశ్మీరాధిపతి మహాచక్రవర్తి! ఆపైన దురహంకారి! ఆపైన మద్యపాన ప్రమత్తతతో అటు ఇటు ఊగిపోతున్నారు! 'అసలే కోతి! ఆపైన ఈతకల్లు బాగా పట్టించింది! ఆపైన తేలు కుట్టింది! ఇక చెప్పాలా దాని వైభవం!' అన్నట్టుంది ఈ వ్యవహారం అంతాను. 'ఆహా! ఈ ప్రభుసేవ ఎంతటి విచ్చుకత్తుల మీద నడక!' అని లోలోపలే ఒక నిట్టూర్పు విడిచి పెట్టాడు ప్రధానామాత్యుడు.

ఇటువంటి విషమ సంధిలో లేనిపోని బెడద నెత్తిమీదికి తెచ్చిపెట్టుకోవడం ఎందుకనుకుని, ఆ తారతమ్య పరీక్ష తనకు తలకు మించిన పని అన్నట్టు ముఖం పెట్టి, ఒక అమాయికమయిన చిరునవ్వు చిలకరించాడు. అంతేగాని దాని కేవిధంగాను ప్రతిసమాధానం చెప్పలేదు. అంతలోనే లలితాదిత్య చక్రవర్తి మరొక మదిరాపాత్ర అంతా గొంతులో గుమ్మరించుకున్నాడు. చింతనిప్పుల్లా మెరుస్తున్న

కళ్ళతో గుడ్లురిమి చూచి దుర్భర క్రోధావేశంతో విరుచుకుపడ్డాడు.

"ఏం? మా ప్రశ్న మీ దివ్యచిత్తాని కింకా హత్తుకోలేదా?"

ఆ ఎత్తిపొడుపుతో మిత్రశర్మ అదిరిపడ్డాడు! అత్యంత వినయ విధేయతలతో దోసిలికట్టి విన్నవించాడు.

"ప్రభూ. ఈ మహానగరాల తారతమ్య పరీక్షకు నే నెంతటివాణ్ణి! ఎర్ర, తెల్ల తామరపువ్వుల్లో ఏది ఎక్కువ సొగసయినదో ఇదమిత్థంగా నిర్ణయించగల వేత్త లెవ్వరున్నారు!"

"ఏమిటేమిటి? వేత్తలెవ్వరు లేరా? అలాగా! మీకు తెలిసినా ఏమి తెలియనట్టు నటిస్తున్నారా? మీ ఆంతర్యం నే నామాత్రం పసి కట్టలేననుకున్నారా? ఇక ఈ ధోరణి కట్టిపెట్టి మీ అభిప్రాయం నిష్కర్షగా బయటపెట్టండి!"

తిరిగి మరింత గట్టిగా గొంతెత్తి గర్జించాడు చక్రవర్తి. మిత్రశర్మ కిక ఊపిరే ఆడలేదు. ఏదో ఒక దారి తొక్కక తప్పదని నిర్ణయించుకున్నాడు.

"కాశ్మీర సార్వభౌమా! తాము నిర్మించిన పరిహాసపురం కాలి గోటితోనయినా ఆ అమరావతి తులతూగజాలదు! సందేహం లేదు! ....అయితే...."

"అయితే?"

మరింత గట్టిగా గొంతెత్తి గర్జించాడు లలితాదిత్యుడు.

దానితో మిత్రశర్మమాట తడబడింది. ముచ్చెమటలు పోశాయి. ఎలాగో అలాగ అతి కష్టంమీద తానుపక్రమించిన వాక్యం నీళ్ళు నములుతూ ముగించాడు.

"అయితే అపర ధర్మమూర్తి ప్రవరసేనులు నిర్మించిన పట్టణం బహు పురాతనమయింది. అపైన రవంత విశాలమయింది. దానిలో మహనీయ దేవాలయా లెన్నెన్నో ఉన్నాయి. కనుక. తాము కట్టిన పట్టణంకన్న చూపువాసి అదే గొప్పదని నా నమ్మిక. విజ్ఞులందరి నోట ఇదే మాట వినవస్తున్నది. ఒకవేళ నేనుగాని పొరబడితే మన్నించవలిసిందని ప్రార్థన."

"ఏమిటేమిటి? మన పట్టణంకన్న ప్రవరపురమే గొప్పదా?"

ఒళ్ళెరగని ఆగ్రహావేశంతో విరుచుకుపడ్డాడు చక్రవర్తి. మిత్ర శర్మ నోరు పెగలలేదు. అతి కష్టంమీద అదే మాట అస్పష్టంగా నసిగాడు.

"చిత్తం! చిత్తం! నా అల్పబుద్ధికి అలాగే స్ఫురించింది! అపరాధమనిపిస్తే మన్నించండి."

"అయితే ఆ ప్రవరపురానికి తక్షణమే నిప్పు పెట్టించి దగ్ధ ధూళిగా మార్చివెయ్యండి!"

ఒక్కమారుగా పెళపెళమని ఉరిమాడు చక్రవర్తి. నిలువునా నిర్ఘాంతపడ్డాడు మిత్రశర్మ. అతని అంతర్యంలో ఆలోచన లొక్క క్షణంలో మెరుపుల్లాగ దూసుకుపోయాయి. 'ఆహా! ఎన్నడు దుష్కార్యాలమాటే తలపెట్టని చక్రవర్తి ఈమధ్య మితిమీరిన మద్యపానంతో ఎంతటి దుష్కార్యానికి పాల్పడుతున్నారు! ఆయన లోలోపలి ఆలోచన తెలిసిఉంటే పరిహాసపురమే ప్రవరనగరంకన్న మిన్నగా ఉన్నదని నొక్కి వక్కాణించేవాణ్నే! అయితే ఇప్పు డంతా చెయ్యి దాటిపోయింది! ఇక ఇప్పు డేమిటి కర్తవ్యం!' అని లిప్తకాలం నిర్ఘాంతపడ్డాడు.

అంతలోనే చక్రవర్తి గొంతు అతని ఎడదలో పడిన పెను పిడుగులా ప్రతిధ్వనించింది.

"ఎందు కలాగ నీళ్ళు నములుతున్నారు! వెనువెంటనే వెళ్ళి ప్రవరపురం నిశ్శేషంగా నిర్దహించి నేలమట్టం చేయించండి."

చక్రవర్తి వేరొక పానపాత్ర గొంతులో గుమ్మరించు కున్నాడు. అదే క్షణంలో మిత్రశర్మ అందుకున్నాడు.

"ధర్మమూర్తీ! వేలకొలది స్త్రీ బాలవృద్ధులతో నిండిన ఆ పట్టణాని కింతమాత్రంచేత నిప్పు పెట్టించడం ధర్మంకాదు! ....రవంత నా మనవి చిత్తగించండి!"

"ఆ! ఆ! ఏమిటేమిటి? నాకే ధర్మాధర్మా లుపదేశిస్తున్నారా? ఎంతటి దురహంకారం!"

సార్వభౌము డుత్తరక్షణంలోనే వేరొక మద్యపాత్ర అందు

కుని గొంతులో గుమ్మరించుకొని విసురుగా నేలమీదికి విసిరివేశాడు! అది ఖంగుమని మారుమ్రోగి తుత్తునియలయింది!

అయినా మిత్రశర్మ రవంత సాహసించాడు.

“మహాప్రభూ! నేనంతటివాణ్ణి కాదు. అయినా న్యాయం చెప్పడం నా ధర్మం! తమ రిప్పుడు కొంచెం మైకంలో ఉన్నారు. కనక రవంత శాంతించి....”

“ఆ! ఆ! మా ఆజ్ఞకే ధిక్కారమా? ఎంతటి తలబిరుసుతనం!”

ప్రచండ సింహగర్జనంవంటి ఆ హుంకరింపుతో మిత్రశర్మకింక ఊపిరే ఆడలేదు! నోరెండిపోతున్న ట్టనిపించింది! అతి కష్టం మీద “చిత్తం! చిత్తం! అలాగే! ఇదిగో, ఈ క్షణంలోనే తమ ఆజ్ఞ నిర్వర్తిస్తున్నాను!” అని విన్నవించి మరునిమిషంలోనే అక్కడి నించి నిష్క్రమించాడు.

*   *   *

అంతలోనే లలితాదిత్య చక్రవర్తి తటాలున లేచి నిలిచి పరిచారిక చేతినుండి వరసగా నాలుగు మద్యపాత్ర లందుకుని ఒక్కొక్క గుక్కలో అవి తాగివేసి, దూరదూరంగా కానవస్తున్న ప్రవరపురం నుండి పెనుమంట లెప్పుడు వెలువడగలవా అని రెప్పపాటయినా లేని నిశ్చలదృష్టితో నిరీక్షించాడు. ఒక్కొక్కలిప్త అతని కొకొక్క యుగంలా స్ఫురించింది. చక్రవర్తి భయంకర వైఖరి పసికట్టిన పరిచారికా పరిచారకు లందరు ఎప్పు డేవిధమయిన ఆపద తమమీద విరుచుకుపడగలదో అని ప్రాణా లరచేతులలో పెట్టుకుని గజగజ వణికిపోయారు. అలాగ ఒక అరగడియకాలం గడిచింది.

క్రమక్రమంగా ‘ప్రవరపురం కాల్చివేస్తున్న భయంకరాగ్నికీల లెప్పుడు కంటబడగలవా!’ అని చక్రవర్తి పట్టరాని తహతహతో అనుక్షణము కుతకుతలాడిపోయాడు. మరికొంతసేపటిలోనే అతని కెదురుగా ప్రవరపురం ప్రాంతంలో పెద్ద ధూమరేఖలతోబాటు భయంకరాగ్నిజ్వాల భగ్గుమని పైకి లేచింది. ఛటచ్ఛటా ధ్వనులతోబాటు పెనుమంట లెల్లెడల నాలుకలు చాచి విజృంభించాయి. మరికొంత

సేపటి కవి కారుచీకటితోబాటు తారకలనే నమిలి మింగివేస్తున్నట్టు నింగిలో అంతట విజృంభించాయి!

ఆ భీకరజ్వాలలవైపు చూచీచూడగానే చక్రవర్తి పట్టరాని ఉల్లాసావేశంతో ఉప్పొంగి, పెద్దపెద్ద కేకలతో, వెర్రిమొర్రి నవ్వులతో వికటనృత్యం ప్రారంభించాడు. ఆవిధంగా భరించలేని ఉత్సాహంతో నృత్యం చేసిచేసి లలితాదిత్యుడు వివశుడై కుప్పగా నేలమీద కూలిపోయాడు. పరిచారికాపరిచారకు లుత్తరక్షణంలోనే అతనిని లేవనెత్తి శయ్యాగారంలో హంసతూలికా తల్పంపై పడుండబెట్టారు. మైకం పోగొట్టే ప్రక్రియలతోబాటు శైత్యోపచారా లారంభించారు. ఆపైన అతని మత్తు క్రమక్రమంగా సడలిపోవడం మొదలుపెట్టింది.

అప్పటి కించుమించుగా రెండుజాముల రాత్రి గడిచింది. చక్రవర్తి శయ్య కెదురుగా తెరిచిన గవాక్షంనుండి నల్ల నల్లని పొగలతోబాటు పెనుమంట లింకా పైపైకి లేస్తూనే ఉన్నాయి.

మరికొంతసేపటికవి క్రమక్రమంగా శాంతించాయి. సన్న సన్నని ధూమరేఖలు కొన్నిమాత్రమే ఇంకా నలువైపుల వ్యాపిస్తున్నాయి. మరికొన్ని నిమేషాలలోనే లలితాదిత్యుని మైకం పూర్తిగా తొలగిపోయింది. అయినా అత డొకింత బడలికతో కన్ను లల్లన మూసుకున్నాడు. అప్పటి కతనికి తాను పట్టుపట్టి అహంకరించి చేసిన భీకరకృత్యం పరిమాణం యావత్తు కట్టెదట జరుగుతున్నట్టు విస్పష్టంగా అవగతమయింది. పశ్చాత్తాపాగ్నిజ్వాల అతని హృదయాంతరాళంలో క్రమక్రమంగా రాజుకున్నది.

'అయ్యయ్యో! విపరీతమయిన మద్యపాన ప్రమత్తతలో పడి మైమరిచి నే డెంతటి ఘోర పాతిత్యాని కొడిగట్టుకున్నాను!' అని అదే పనిగా మథనపడడం ప్రారంభించాడు. ఆ సమయంలో అతని శ్రుతికుహరాలలో దిక్కుమొక్కులేని వేలకొలది స్త్రీ బాలవృద్ధుల ఘోరాక్రందనం భోరుమని మ్రోగింది. అత డది భరించలేక చూపుడు వేళ్ళతో చెవులు రెండు గట్టిగా మూసుకున్నాడు. అయినా దహన జ్వాలలో పడి కాలి మసి అయిపోతున్న ప్రవరనగర పౌరుల శరీరా లన్ని అతని కట్టెదుట వికృతంగా సాక్షాత్కరించాయి! ఆ ఘోర

దృశ్యం చూడలేక కళ్ళు రెండు మూసివేసుకున్నాడు. అయినా మనస్సులో తిరిగి అదే బీభత్సదృశ్యం విలయతాండవం చేస్తున్నట్టు పొడగట్టింది. తన దారుణ పాపజీవితానికింకెన్నటికీ నిష్కృతి లేదనుకున్నాడు. పోనీ, అప్పుడయినా చావగా మిగిలినవారినందరిని సంరక్షిస్తే బాగుండునని ఆలోచించాడు. కాని ఏమి లాభం? అప్పటికే అంతా పరిసమాప్తమయిపోయింది! ఇంక ఆ ప్రాంతం నుండి సన్నని పొగకూడా బయలుదేరడంలేదు!

అప్పటికప్పుడే రాత్రి మూడవజాముకూడా గడిచిపోవచ్చింది. ఇక చెయ్యగలిగిన దేమి మిగిలింది? తెల్లవారుజామున మిత్రశర్మనొకసారి పిలిపించి, ఆపైన చెయ్యవలసిన దేమయినా ఉంటే చేయించవచ్చునని నిర్ణయించుకున్నాడు.

రవంతసేపు నిద్రపోవాలని కళ్ళు మూసుకున్నాడు. కాని ఎంతగా ప్రయత్నించినా కంటి కొక్క కునుకయినా పట్టలేదు! ప్రవరపురంలో జరిగిఉండవచ్చు ననుకున్న కరాళదృశ్యాలన్నీ తిరిగి అతని సమక్షంలో వికటాట్టహాసంతో వికృతనృత్యా లారంభించాయి. మరి కొంతసేపటి కతనికి రవంత మగత నిద్ర పట్టింది.

* * *

మరునా డుదయమే లలితాదిత్యు డెదురుచూడని ఒక విచిత్ర సంఘటన జరిగింది. ప్రధానమంత్రి నొకమారు పిలిపించవలెనని అతడనుకుంటూండగానే మిత్రశర్మ సందర్శనంకోసం వేచిఉన్నారని ద్వారపాలకుడు లోపలికివచ్చి నివేదించాడు.

'అంత తొందరగా ప్రధానామాత్యుని రాకకు కారణమేమయి ఉంటుందా?' అని మథనపడుతూనే శీఘ్రమే ప్రవేశపెట్టవలసిందన్నట్టు శిరస్సొకించుక పంకించాడు చక్రవర్తి. మిత్రశర్మ లోపలికి వస్తూనే చేతులు కట్టుకుని అత్యవసర వ్యవహారమేదో నివేదించవలసి ఉన్నదన్నట్టు ముఖకవళికతో సూచించాడు. లలితాదిత్య చక్రవర్తి ఉసూరుమని నిట్టూర్చి బొమముడి విరిచి ప్రశ్నించాడు.

“ఎందు కలాగ విపరీతంగా ఖేదపడుతున్నారు! ఇంతకీ దీనికంతటికీ పూర్తి పూచీ నాదేకదా? మధ్యన మీ కెందు కీ అనవసర

వ్యథ? అంతా పరిసమాప్తమయిపోయినట్టే గదా!''

మిత్రశర్మ శిరస్సు బాగా వంచుకుని విన్నవించాడు:

''అఁ. నేటితో అంతా పరిసమాప్తమయిపోయినట్టే! అయితే, నా దొక చిన్న విజ్ఞప్తి....చిరకాలంనించి మీ కనుసన్నలలో మసలు కుంటూనే మీ ఆజ్ఞలన్నీ అక్షరాలా అనుభవించాను....కాని ఇక ఆ తీరులో ఆచరించలేనేమో అని ఆందోళనపడుతున్నాను....కనక నాకీ ప్రధానామాత్య పదవినుండి విముక్తి కలిగించవలసిందని వేడుకుంటున్నాను.''

చక్రవర్తికా ప్రత్యుత్తరంలో గల అంతరార్థం తిన్నగా బోధపడలేదు! చెలరేగుతున్న ఆందోళనతో ప్రశ్నించాడు.

''ఏం? ఎందుచేత?''

''ఇన్నాళ్ళనించి నే నెన్నడు మీ ఆజ్ఞ ధిక్కరించలేదు! నిన్న రాత్రే మొట్టమొదటగా అటువంటి ధిక్కారణం జరిగింది.''

''అంటే?''

తన కా ప్రత్యుత్తరం తిన్నగా బోధపడక కొంచెం గట్టిగానే గొంతెత్తి ప్రశ్నించాడు లలితాదిత్యుడు. అయినా మిత్రశర్మ తొణక లేదు, బెణకలేదు.

''తా మాజ్ఞాపించినట్టు నిన్న రాత్రి నేను ప్రవరపురానికి నిప్పు పెట్టించలేదు!''

''నిజంగా నేనా?''

ఉప్పొంగుతున్న ఉత్కంఠతో ప్రశ్నించాడు చక్రవర్తి.

''నిజమే. తమ సమక్షంలో అసత్యం చెబుతానా? నే నన్నది అక్షరాల యథార్థమే!''

మరికొన్ని క్షణాలలోనే చక్రవర్తి ముఖకవళిక తీవ్రాతి తీవ్రంగా మారిపోయింది.

''ఎందుచేత?''

''నా కది కేవలం దురన్యాయమని, మహాఘోర కృత్యమని అనిపించింది.''

''అయితే ఆ పెనుమంట లెలాగ బయలుదేరాయి!''

"ప్రవరపురం సమీపంలో పెద్ద పెద్ద గడ్డి మేటులు, వేల కొలది వెదురుగడలు పోగులుపెట్టించి వాటికి నిప్పంటించేటట్టు చేశాను."

చక్రవర్తి నాలుగయిదు నిమిషాలవరకు బదులు చెప్పలేదు. అంతలోనే అతని ముఖం జేవురించింది.

"ఎందు కలాగ చేశారు? నా ఆజ్ఞ ధిక్కరిస్తే శిరశ్ఛేదమే శిక్ష అని మీరెరుగుదురు కదా!"

"నే నా సంగతి మరచిపోలేదు. అన్నింటికి సిద్ధపడాలని నిశ్చయించుకున్న పిమ్మటే మీ ఆజ్ఞ ధిక్కరించాను ...కనక నే ఈ అమాత్యపదవినుండి శీఘ్రమే విమోచనం ప్రసాదించవలసిందని వేడుకుంటున్నాను."

చక్రవర్తి ఆ ప్రతిసమాధానంతో భరించలేని ఆక్కసుతో గజగజ వణికిపోయాడు.

"ఈ వంకతో మరణశిక్షనించి తప్పించుకుని బయటపడాలని ఆలోచిస్తున్నారా? అది ఎన్నటికి జరగనేరదు! మరణశిక్ష అనుభ వించిన పిమ్మటే మీ కీ అమాత్యపదవి నుండి విముక్తి! తెలిసిందా?"

"పోనీ, అలాగే! దానికేమి! నే నన్నిటికి సిద్ధపడే తమ సన్నిధికి వచ్చానని విన్నవించుకున్నాను గదా!"

అచంచల ధైర్యంతో ఎక్కడ చెక్కుచెదరకుండా నిలుచున్న మిత్రశర్మ ధోరణి గమనించి చక్రవర్తి తన కన్నులే నమ్మలేక పోయాడు! తటాలున లేచి నిలిచి, మిత్రశర్మ చేతులు రెండు పట్టుకుని తన మహదానందం వ్యక్తీకరించాడు.

"అమాత్యమణీ! మీరు చేసిన ఆజ్ఞాధిక్కరణంవల్ల నే నెన్న టికి మరచిపోలేని మేలు చేసినవారయినారు! ఇందువల్ల నన్ను వేల కొలది అమాయిక పౌరుల దారుణ హత్యనుండి సంరక్షించారు! కనక నే నెన్నటికి మీ ఋణం తీర్చుకోలేను! ఇటువంటి మహనీయులు

మీకు మరణశిక్ష విధించగలనా? నిజానికి విపరీత మద్యపానంతో మైమరిచి, కన్నుమిన్ను కానక ప్రవర్తించిన నేనే అటువంటి శిక్ష కర్హుణ్ణి....మీ మనో ధైర్యం పరీక్షించడానికే నే నలాగ కటువుగా మరణశిక్ష విధించగలనని హెచ్చరించాను. అంతే! మీ ఎడల గౌరవమే కాని నా కింకొక దృష్టే లేదు. మీ రిది వేరొక విధంగా భావించ నవసరంలేదు."

అయినా మిత్రశర్మ ముఖంలో ప్రసన్నత వికసించలేదు. రవంతసే పాలోచించి దోసిలి కట్టుకుని వేడుకున్నాడు.

"నా ఆజ్ఞాధిక్కారం మన్నించి నన్నీవిధంగా దారుణ మరణ శిక్షనుండి తప్పించినందుకు మీకిదే నా కృతజ్ఞత. కాని, ఒక్కా మనవి. ఇక నే నీ ప్రధానామాత్యపదవి నిర్వహించలేను. కరుణించి నా కీ పెద్ద బరువు తప్పించండి! నా కింతకన్న కోరుకోవలసిన దేమిలేదు."

మరికొంత సేపటివరకు లలితాదిత్యుని నోట మాట పెగలలేదు.

"ఇదేమిటి, ఇలాగంటున్నారు? ఎందుచేత మీ కీ పదవిమీద ఇంతటి విరక్తి కలిగింది?"

"విరక్తివల్లకాదు. ఇది ఇంక నావల్ల అయ్యే పనికాదు."

ఖచ్చితంగా తన నిర్ణయం వెల్లడించాడు మిత్రశర్మ.

"ఎందుచేత?"

మరింత ఆశ్చర్యపడి అడిగాడు చక్రవర్తి.

"ఇక ముమ్ముందుకూడా ఎప్పుడయినా మీ రిటువంటి ఉత్తరువులే ఇయ్యవచ్చును. ఆపైన మీ ఆజ్ఞ ధిక్కరించడం నా కెంతో క్లిష్టంగా పరిణమించవచ్చును....అదీగాక మీ ఆజ్ఞాధిక్కారానికి శిరశ్ఛేదమే కదా తగిన శిక్ష!"

సార్వభౌముడు దానితో బాగా కంగారుపడ్డాడు.

"నే నిది మద్యపానంతో మత్తెక్కిన స్థితిలో ఇచ్చిన ఉత్త రువు! ఇటువంటి పరిస్థితిలో నా ఆజ్ఞలేవి ఇక మీరు పాటించనక్కర లేదు! సరికదా!"

అయినా మిత్రశర్మ దాని కంగీకరించలేదు. తిరిగి రవంతసే పాలోచించి ప్రసన్న ముఖభంగిమతో తన అభ్యంతరం వెలువ రించాడు.

"ఇక ఇప్పు డీ మాట చెప్పక తప్పకపోయినందుకు నన్ను మన్నించ ప్రార్థన....తా మొక్కొక్కప్పుడు మితిమీరిన మైకంలో ఉన్నట్టే ఉత్తరువు లిస్తూంటారు. అయితే ఆ మైకం మద్యపానంవల్ల కలిగినదో లేదో నా కెలాగ తెలుస్తుంది? ఇది నా తలకుమించిన పని! కరుణించి నన్నిక అటువంటి ఇబ్బందిలో పెట్టవద్దని మనవి."

లలితాదిత్య చక్రవర్తి రవంతసేపు తల పట్టుకుని కూర్చు న్నాడు. 'ఈ మద్యపానంవల్ల నామీద నేడెంతటి పెద్ద బెడద విరుచుకు పడింది!' అని ఆంతర్యంలో మిక్కిలి నొచ్చుకున్నాడు. మిత్రశర్మ వంటి ధర్మశీలి, ధైర్యశాలి, దక్షుడు తన కెల్లవేళల తోడుపడనప్పుడు కాశ్మీర సామ్రాజ్య సంరక్షణం తన ఒక్కనివల్ల అయ్యేపనికాదని బాగా ఆందోళనపడ్డాడు. తిరిగి అలతి నగవుతో బ్రతిమాలుకున్నాడు.

"ఒకవేళ నే నన్యాయంగా ఎప్పుడయినా, ఏదయినా ఆజ్ఞఇస్తే మీరది తప్పక ధిక్కరించవచ్చును. ఇక ఇంతకన్న నేనేమి చెప్ప గలను! నా ప్రార్థన కాదనక మన్నించండి!"

అయినా మిత్రశర్మ తిరిగి బ్రతిమాలుకున్నాడు.

"చక్రవర్తీ, మీ అధికారం హస్తగతం చేసుకోవాలని నే నీవిధంగా విన్నవించడంలేదు....నామీది నమ్మికకు, ఆదరాభిమానా లకు ఇదే నా కృతజ్ఞత. అయితే నేనింక వారణాసికి పోయి దైవతా

ర్పనతోనే నా జీవిత శేషం వెళ్ళబుచ్చుకోవాలని ఆత్రపడుతున్నాను. దయుంచి నా కింక రవంత విశ్రాంతి ప్రసాదించండి."

కాశ్మీరాధిపతి పెదవులపై చిరునగవు చెంగలించింది.

"మీరన్నివిధాల సర్వసమర్థులు! ధర్మతత్పరులు! ఇటువంటి వారు అమాత్యధర్మానికి తిలోదకాలిచ్చి, వారణాసికి పోయి ముక్కు మూసుకుని కూర్చుంటామంటే నే నంగీకరించగల ననుకుంటున్నారా? ఈ స్వధర్మ పరిత్యాగానికి నేనెన్నటికి అనుమతించను. అదిగాక, ప్రధానామాత్యులుగా ఉన్నప్పుడే మీరు నా ఆజ్ఞ ధిక్కరించవచ్చును! లేకపోతే మా ఆజ్ఞాధిక్కార ఫలితం అక్షరాల అనుభవించితీరవలి సిందే! తెలిసిందా? జాగ్రత్త!"

మిత్రశర్మ ఆ ప్రసంగంలో గల ఆదరాభిమాన గౌరవాలతో బాటు, ఛలోక్తి చక్కగా ఆకళించుకున్నాడు. తా నిక ప్రధానామాత్య పదవి యథాప్రకారంగా నిర్వహించనున్నట్టు చల్లని చిరునవ్వుతో వ్యంగ్యంగా సూచిస్తూ "ఈ విశాల కాశ్మీర సామ్రాజ్యంలో మీ ఆజ్ఞ ధిక్కరించడాని కెవ్వరికి గుండెలున్నాయి, మహాప్రభూ! నేను తమ ఆనతి శిరసావహిస్తున్నాను" అని తన అంగీకారం జయజయాభి వందనతో వెల్లడించి పీడ్కొన్నాడు.

---